వైసీపీ హయాంలో ఇసుకను బంగారంగా మార్చి బొక్కేశారు. ఇసుక పాలసీల పేరుతో నిర్మాణదారులకు చుక్కలు చూపారు. భవన నిర్మాణ కూలీలకు పనులు లేకుండా చేశారు. పాలకులేమో రూ.కోట్లు కొట్టేశారు. ఇసుక అక్రమాలకు చెక్ చెప్తూ.. అందరికీ అందుబాటులోకి తెస్తూ.. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా.. కూలీల ఉపాధికి ధోకా లేకుండా.. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వ పాలసీ ప్రకారం ఎక్కడా కూడా ఇసుక సరఫరా జరగడం లేదని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. గతంలో ఏవిధంగా అయితే వసూలు చేశారో ఆ ప్రకారంగానే ప్రస్తుతం కూడా ఇసుకను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుకతో బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో ఉచిత ఇసుక లబ్ధి నిర్మాణదారులకు అందడంలేదని తెలుస్తోంది. స్టాక్ యార్డుల్లో కూడా బ్రోకర్ల హవానే కొనసాగుతోంది. దీంతో ఉచిత ఇసుక కోసం వెళ్లిన సామాన్యులకు సక్రమంగా అందడంలేదని సమాచారం. అధికా రులు కూడా బ్రోకర్లకు సహకరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఈ క్రమంలో నిర్మాణదారులు ఇసుక రూపంలో దోపిడీకి గురవడం పరిపాటిగా మారింది. అధికారులు కలగ చేసుకొని ఉచిత ఇసుక విధానం సక్రమంగా జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు.

బ్రోకర్లకే.. ఉచితం





పిట్టలవానిపాలెం మండలంలో ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక

ప్రభుత్వం మారినా ఆగని దందా

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైసీపీ ఇసుక పాలసీని రద్దు చేస్తూ చంద్రబాబు ఉచిత ఇసుకను ప్రవేశపెట్టారు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్లు ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడిన ఇసుకాసురులు కొత్త ప్రభుత్వంలోనూ ఇసుక దందా కొనసాగి స్తున్నారు. దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వస్తు న్నాయి. బినామీ పేర్లతో ఉచిత ఇసుకను బ్లాక్ చేసి గతంలోలానే విక్రయి స్తున్నారు. ఇదిలా ఉంటే చాలా చోట్ల ఇంకా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ఇసుక మాఫియాను నడిపించిన నేతలే నేటికీ అదే రీతిలో దందా నడిపించడం గమనార్హం.

- వినియోగదారులకు అందని ఉచిత ఇసుక
- డంపింగ్ యార్డుల వద్ద బ్రోకర్లదే హడావుడి
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ పాలసీ అభాసుపాలు
- యథావిధిగానే దోపిడీకి గురవుతున్న నిర్మాణ దారులు
- పలు ప్రాంతాల్లో వైసీపీ నేతల అనుచరుల దందా
- స్టాక్ యార్డుల వద్ద వారికి సహకరిస్తున్న అధికారులు

బాపట్ల, అచ్చంపేట, తుళ్లూరు, అమరావతి, కొల్లిపర/బాపట్ల (ఆంధ్రజ్యోతి), జూలై 27: ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం. నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా చార్జీలు వసూలు చేయాలి. గత ప్రభుత్వంలో జరిగినట్లు అక్రమాలు జరగడానికి వీల్లేదు. వినియోగదారులు దోపిడీకి గురి కాకూడదు. ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు ఇసుక విషయంలో జోక్యం వద్దు.. ప్రభుత్వానికి అప్రతిష్ఠ రాకూడదు. సామాన్యు లకు ఉచిత ఇసుక అందాలి. నిర్మాణదారులకు లబ్ధి చేకూరాలి. కూలీలకు పుష్కలంగా పనులు ఉండాలి.. అని ముఖ్యమంత్రి చంద్ర బాబు చెప్తున్నారు. అయితే ఎక్కడా కూడా చంద్రబాబు చెప్పినట్లు జరగడంలేదు. ఉచిత ఇసుకలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే ఆ ప్రకారం డంపింగ్ యార్డుల వద్ద ఇసుక లోడింగ్ కానీ, రవాణా కానీ జరగడంలేదు. డంపింగ్ యార్డుల వద్ద ఇసు క బ్రోకర్లదే రాజ్యమన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ అభాసు పాలవుతుంది. కొందరు బ్రోకర్లు నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా జరుగుతుంది.



అమరావతి: వైకుంఠపురం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

వందలాది లారీల ద్వారా కొందరు జేబులు నింపుకుంటున్నారు.

బుసక ముసుగులో ఇసుక

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో బుసక ముసుగులో ఇసుకను పెద్దఎత్తున తరలిస్తున్నారు. తాను అధికారపార్టీ నాయకుడ్ని అడ్డుకునే వారెవరంటూ ఓ నేత చెలరేగిపోతున్నాడు. కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. ప్రభుత్వం మారినా వైసీపీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లో వెస్ట్ బాపట్ల మహాత్మా



వెస్ట్‌బాపట్ల పరిధిలోని మహాత్మాజీపురంలో నిల్వచేసిన ఇసుక దిబ్బలు

జీపురం శివారుల్లో రాత్రిపూట ఇసుక తరలి పోతోంది. దరివాద కొత్తపాలెం వైసీపీ నాయకులు కూడా ఇసుక దందాలో ఇంకా కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బాపట్ల, చీరాల మండలాల సరిహద్దుల్లోని అడవి గ్రామ పంచాయతీ పరిధి ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ వద్ద బుసక పేరిట తవ్వి లే అవుట్లలో మెరకలకు ఉపయోగిస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో పొలాలను సైతం తవ్వి తరలిస్తున్నారు. కొన్నిచోట్ల కాల్వకట్టలను సైతం తవ్వేస్తున్నారు. బాపట్లకి చెందిన ఓ వైసీపీ నేత బినామీల ద్వారా ఉచిత ఇసుకను అక్రమంగా తెప్పించుకుని అధిక ధరకు విక్రయిస్తుండగా ఇటీవల అధికారులు దాడులు చేశారు. ఇసుక దందాలో బాపట్ల రూరల్ పరిధిలోని ఓ వైసీపీ నేతే ఇప్పుడు కూడా కీలకంగా ఉంటున్నాడు. ఇతడికి అధికారపార్టీలోని ద్వితీయశ్రేణి నేతల్లో కొందరు సహకరిస్తున్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం, గణపవరం పరిసరప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారి పక్కనే రెండు ఎకరాల భూమిని 8 అడుగుల ఎత్తున ఇసుకతో మెరక చేసి చుట్టూ ప్రహరీ కట్టి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధమయ్యారు. హైవేపై రాకపోకలు సాగించే అధికారులకు ఇది కనిపించకపోవడం విచిత్రం. పిట్టలవానిపాలెం మండలం చందోలు, రెడ్డిపాలెం, జీఎస్‌పాలెం, అల్లూరు పరిసరప్రాంతాల్లో ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుకతోపాటు నల్లమట్టిని కూడా తరలిస్తున్నారు. చీరాల మండలం దేవినూతల గ్రామం నుంచి ఇసుకను తరలిస్తూ ఓ దళారి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల పరిసరప్రాంతాల్లో స్థలాల మెరక చేయాలంటే కాంట్రాక్ట్ తీసుకుని జేబులు నింపుకుంటున్నాడు. గత వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా ఇసుక విక్రయాలు జరిపిన ఇతడే ప్రస్తుతం ఉన్న పాలకులను ప్రసన్నం చేసుకుని ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడు.

- అచ్చంపేట మండలం కోనూరులో యార్డులో దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలకు సకాలంలో లోడింగ్ జరగడం లేదు. ఆలస్యంగా వచ్చిన లారీలకు బ్రోకర్లు ముందుగా స్లిప్పులు రాయించి లోడు చేయిస్తున్నారు. ఈ విషయంలో రెండు రోజుల క్రితం గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. ఓ పార్టీకి చెందిన నాయకులు బెదిరించి ఇసుక తీసుకెళ్తున్నారని తెలిసింది.

- తుళ్లూరు మండలం లింగాయపాలెం స్టాక్ పాయింట్‌లో స్థానికత పేరుతో ఓ వైసీపీ నేత అనుచరుల హవా సాగుతుంది. అడ్డదారులలో వచ్చి వాహనాలను ముందు సీరియల్‌లో పెట్టి లోడింగ్ స్లిప్‌లు ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారు. గతంలో ఇసుక దందాలు చేసిన ఉద్దండ్రాయుపాలెంలో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు ఇప్పుడు కూడా వాహనాల్లో వచ్చి బెదిరించి టోకెన్లు తీసుకుని ఇసుకను తరలించుకుపోతున్నారు.

- కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో గందరగోళం కొన సాగుతోంది. నాయకులు తమకు ఇష్టం వచ్చిన వారికి టోకెన్లు ఇస్తున్నట్లు ఇసుక కోసం వచ్చిన వాహనదారులు శుక్రవారం తనిఖీలకు వచ్చిన జేసీ భార్గవ్ తేజ ఎదుటే వాపోయారు. ఉచిత ఇసుక విధానం బాగున్నా స్టాక్ పాయింట్లలో నాయకులు, బినామీల కారణంగా సక్రమంగా అమలు కావడం లేదన్నారు.

- అమరావతి మండలం వైకుంఠపురం రీచ్‌లో నేతల బంధువులు, వారి అనుచరులు ఇసుక లోడింగ్‌కు వాహనాలు రాకముందే వేర్వేరు ఆధార్ నెంబర్లతో బుక్ చేసుకుంటున్నారు. అదనంగా రూ.వెయ్యి ఇచ్చిన వారికి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకెళ్లిన ఇసుకను రూ.16 వేల వరకు విక్రయిస్తున్నారు. 20 టన్నుల ఇసుక గుంటూరుకు 12 వేలకు చేర్చాల్సి ఉండగా వాహన యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వచ్చిన వాహనాలు సరియైన సమయంలో లోడింగ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఇసుక మాఫియాలో పాలుపంచుకున్న వారు ప్రస్తుతం పార్టీ మారి రీచ్‌ల్లో తిష్ఠ వేసి ఇసుక దందా కొనసాగిస్తున్నారు.



కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో శుక్రవారం లోడింగ్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ భార్గవ్‌తేజ



అచ్చంపేట: కోనూరులో ఇసుక డంపింగ్ యార్డులో లారీలకు లోడు చేస్తున్న దృశ్యం

ఉద్యోగాల పేరుతో.. జగన్మాయ



చెన్నాయపాలెం సమీపంలోని సరస్వతి పవర్ ప్రాజెక్టు పేరుతో కొనుగోలు చేసిన భూములు

- 17 ఏళ్లు గడిచినా ఊసేలేని సిమెంట్ ఫ్యాక్టరీ
- కొలువులిస్తామని కారుచౌకగా 1515 ఎకరాలు కొట్టేశారు
- పరిశ్రమ ఎప్పుడు కడతారో చెప్పరు.. అడిగితే ఊరుకోరు
- ఇంటికొకరికి ఉద్యోగమని 350 మంది రైతులను వంచించిన జగన్

పిడుగురాళ్ల, జూలై 27: పొలం ఉంది కానీ పంట పండుతుందో లేదో.. అదే ఉద్యోగం అయితే ఠంచన్‌గా జీతం వస్తుంది.. పిల్లలు బాగుపడతారు.. అని రైతులు ఆశించారు. వారిని నమ్మించి 17 ఏళ్లుగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వంచిస్తూ వస్తున్నారు. ఫ్యాక్టరీ ఎప్పుడు కడతారో తెలియదు.. అడిగితే సహించక పోవడంతో నాటి రైతులు నేడు దినసరి కూలీలుగా, కార్మికులుగా మారి జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా పంటలతో పచ్చగా ఉండే భూములు బీళ్లుగా మారగా.. పనులతో సందడిగా ఉండే గ్రామాల్లో చేసేందుకు పనులు లేక రైతు కుటుంబాలు దయనీయస్థితిలో ఉన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు.. మాచవరం మండలంలో సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు జగన్ అండ్ కో సిద్ధమైంది. ఈ క్రమంలో 2007 నుంచి 2013 మధ్య దాచేపల్లి మండలం తంగెడ, మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల పరిధిలో సుమారు 350 మందికి పైగా రైతుల నుంచి సుమారు 1515 ఎకరాలను కొనుగోలు చేశారు. అప్పట్లో వెంటనే ఫ్యాక్టరీ నిర్మించి ఇంటికొకరికి ఉద్యోగం ఇస్తామని రైతులను నమ్మించి భూములను కొనుగోలు చేశారు. ఎకరం రూ.3 లక్షల నుంచి 6 లక్షల మాత్రమే ఇచ్చి కొనుగోలు చేశారు. అయితే ఉద్యోగం వస్తే పిల్లల జీవితాలు బాగుపడతాయన్న ఆశతో రైతులు భూములను సరస్వతి యాజమాన్యం అడిగిన ధరకే కట్టబెట్టారు. అయితే పదిహేడేళ్లుగా జగన్ అండ్ కో సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం విషయంలో స్థానికులను మభ్యపెడుతూనే వస్తోంది. ఎప్పుడు అడిగినా ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా జగన్ ఆడుతున్న నాటకాలకు చెక్ పెట్టేందుకు టీడీపీ ప్రభుత్వం 2018లో మైనింగ్ లీజును రద్దు చేసింది. జగన్ అధికారంలోకి వచ్చాక 2059 సంవత్సరం వరకు మైనింగ్ లీజును పొడిగిస్తూ 2020 ఆగస్టులో జీవో తెచ్చుకున్నారు. అయితే జీవో హడావుడిగా తెచ్చుకున్నారు కానీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.

రిక్షా తొక్కుతున్న రైతులు

జగన్ అండ్ కో భూములు సేకరించినప్పుడు ఉద్యోగాలు పొందేందుకు అర్హులుగా ఉన్న వారిలో కొందరికి ప్రస్తుతం వయసు మించిపోయింది. చాలామంది పొలాలు అమ్ముకుని వేరే పనులు చేసుకునేందుకు పట్టణాలకు వలస వెళ్లారు. కొందరు రైతులు కుటుంబాలను పోషించుకునేందుకు విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి రిక్షా కార్మికులుగా, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మన్లుగా, మరికొందరు భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. కొంతమంది రైతులు బతకడానికి వెళ్లి ఆయా ప్రాంతాల్లోనే అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారు కూడా ఉన్నారు.

చంపడానికి వెనుకాడటం లేదు

ఫ్యాక్టరీ నిర్మించి పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పదిహేడేళ్లైనా ఆ ఊసే ఎత్తని సరస్వతి యాజమాన్యం భూములు ఇచ్చిన రైతులపై భౌతిక దాడులకు సిద్ధపడుతుంది. గతంలో ఇదే విధంగా అడిగినందుకు మాచర్ల నుంచి రౌడీలను తెప్పించి మరీ పెట్రోలు బాంబులు, వేట కొడవళ్లతో తెగనరికారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూముల్లో మట్టితవ్వకాలు



సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ పేరుతో కొనుగోలు చేసిన భూముల్లో రాత్రి పూట వైసీపీ నేతలు కొందరు మట్టితవ్వకాలు జరిపి దండిగా జేబులు నింపుకున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం మేము చూస్తామో.. లేదో అన్న సందేహం కలుగుతుంది.

\- వెంకటేశ్వర్లు

వయసు మించి పోతుంది..

భూములు కొనుగోలు చేసిన వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించి ఉద్యోగం ఇస్తామన్నారు. మైనింగ్ లీజ్‌ను కూడా పొందారు. ఇప్పటి వరకు పనులేమీ మొదలు పెట్టలేదు. యువకుల వయ సు పరిధి కూడా మించి పోతుంది.



\- యలమంద నాయక్

ఉద్యోగం ఊసే లేదు



బొగ్గవరపు అంజయ్య, రైతు

మా నుంచి అతి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. భూములు ఇచ్చిన ప్రతి కుటుంబానికి అర్హతను బట్టి ఉద్యోగం ఇస్తామని అప్పట్లో చెప్పారు. ఇప్పటికీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్ట లేదు. ఉద్యోగాల ఊసే లేదు.

అతీగతిలేని ఫ్యాక్టరీ



బచ్చలపూడి రవి

భూములు కొనుగోలు సమయంలో ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఫ్యాక్టరీ ప్రతినిధులు తియ్యని మాటలు చెప్పి నమ్మించారు. మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మాం. పెద్దలను ఒప్పించి భూములను తక్కువ ధరకు ఇప్పించాం. ఇన్నేళ్లుగా ఫ్యాక్టరీ పనులు అతీగతి లేదు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పీఆర్ వన్ యాప్‌పై సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, జూలై 27: జిల్లాలో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. పీఆర్ వన్ యాప్‌పై శనివారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన పీఆర్ వన్ యాప్ ద్వారా జిల్లాలో పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షిస్తామన్నారు. ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు యాప్ గురించి సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని ఆదివారం సైతం కొనసాగించాలని ఆదేశించారు. ఆదివారం నాటికి యాప్ నమోదులో వెనుకబడిన మండలాల అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి, డీఎల్డీవోలు వెంకట్‌రెడ్డి(నరసరావుపేట), గఫూర్ నాయక్ (గురజాల), రాజగోపాల్(సత్తెనపల్లి), డీపీఆర్వో ఓం ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7లో..

వికటించిన వైద్యం.. ఒకరి మృతి


ఆర్ఎంపీపై పోలీసులకు బంధువుల ఫిర్యాదు

ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలు మార్గంలో ట్రాఫిక్ బ్లాక్

- రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్




studio green
STUDIO GREEN FILMS (P) LTD.
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY
SAM ANTON
CO-PRODUCED BY NEHA GNANAVELRAJA
PRODUCED BY
KE GNANAVELRAJA
AADHANA GNANAVELRAJA
IN CINEMAS
AUGUST 2ND
Junglee


కనిపించేదంతా మున్నేత్రుడి మర్మమే
GANGA
1ST AUG
IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI APSAR
SIVENDRA ANITH MADADI VIKAS BADISA
SAHI SURESH CHOTA K PRASAD NAIDU-PHANI
TALK SCOOP


VIJAYA BHASKAR KRAFT
ఆగస్టు
2
బ్రహ్మాండమైన
విడుదల
A VIJAYA BHASKAR FILM
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN
Pre Release Event
ON SUNDAY
28.7.2024
T-SERIES


INFINITI FILM VENTURES
IN THEATRES
AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
SCRIPT | DOP | DIRECTION SD VIJAY MILTON
PRODUCED BY
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


ASIAN SURESH
SUN PICTURES
DHANUSH
MASSIVE
BLOCKBUSTER
KALANITHI MARAN
PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL
DIRECTOR OF PHOTOGRAPHY OM PRAKASH EDITOR PRASANNA GK PRODUCTION DESIGNER JACKI ACTION CHOREOGRAPHER PETER HEIN


SVC RELEASE
అలనాటి
రామచంద్రుడు
IN CINEMAS
AUG 2nd
AUDIO ON Junglee


TRISHA PRESENTS
SUPARSH
AUGUST
2ND
IN THEATERS
తిరగబడరసామీ...
MALKAPURAM SHIVAKUMAR A S RAVIKUMAR CHOWDARY
ADITYA MUSIC

యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



రక్తదానం చేసిన విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం డాక్టర్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్ ఎస్ఎస్ విభాగం వారు జీజీహెచ్ గుంటూరు, నీడ్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, తలసేమియా నీడ్స్ బ్లడ్‌బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా తిరిగి భర్తీ చేసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమడ ఆధునీకరించి గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి

● రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

బాపట్ల, జూలై 27: కోస్తా జిల్లాల ప్రధాన సమస్యగా ఉన్న నల్లమడ డ్రెయిన్ ఆధునీకరణతోపాటు గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి చేస్తానని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తన స్వగ్రామమైన బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి శనివారం వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా నల్లమడ ఉందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఆధునీకరణకు కేటాయింపులు చేసినప్పటికి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి వాటిని నిలుపుదల చేశారన్నారు. డ్రైనేజి వ్యవస్థ అంతా అస్థవ్యస్తమైపోయిందన్నారు. పంటపొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. వీటిన్నిటిపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగించటంతోపాటు మెట్టపొలాలకు ఎత్తిపోతల పథకాలు కూడా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వానికి కొంత ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు.నిధులన్ని సమీకరించుకుంటూ ఒకవైపు అప్పులు తీర్చుకుంటూ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిఉందన్నారు. ఎన్డీయే సహకారంతో నిధులు సమీకరించి రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

మండల్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిందే

● ఆగస్టు 7న చలో అమృత్‌సర్‌ను విజయవంతం చేయాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, జూలై 27: మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 7న మండల్‌డే సందర్భంగా పంజాబ్ అమృత్‌సర్‌లో జరగనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభకు బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా బడ్జెట్లో కేటాయింపులు జరపాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా కులజనగణన పారదర్శకంగా చేపట్టాలని కోరారు. విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న 27శాతం రిజర్వేషన్లను, బీసీల జనాభా దామాషా మేరకు పెంచాలన్నారు. చట్టసభల్లోనూ ఆ మేరకు రిజర్వేషన్లు ఇచ్చేలా పార్లమెంటు చట్టాలు చేయాలని కోరారు. ఆగస్టు 7 రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో బీపీ మండల్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఓబీసీ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర యువజన ప్రధానకార్యదర్శి కె.హనుమంతు, పి.మహేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే లక్ష్యం

● త్వరలో పేట ప్రజలకు అందుబాటులోకి మినరల్ వాటర్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 27: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండు మూడు నెలలుగా పట్టణవాసులకు ఏర్పడిన తాగునీటి సమస్యకు చరమగీతం పాడనున్నామని, పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే తన ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మంచి నీటి చెరువు వద్ద మోటార్ల ద్వారా నీటిని నింపుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేట తాగునీటి సమస్యను నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామని, ఐదు టీఎంసీల నీరు పట్టణ వాసుల తాగునీటి అవసరాలకు సరి పోవని, మరో మూడు టీఎంసీల నీరు అదనంగా కావాలని అడిగి వారిని ఒప్పించామన్నారు. నీటి విడుదల వచ్చే నెల 6వ తేదీ వరకు ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు. ఇక నుంచి పట్టణంలోని మెరక ప్రాంతాల్లో కూడా నీటి సమస్య లేకుండా నీటి పరిమాణాన్ని పెంచి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌టీఆర్ సుజల ద్వారా రూ.2కే మినరల్ వాటర్‌ను ఆగస్టు 10వ తేదీ నుంచి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న 25 ఔట్‌లెట్‌ల ద్వారా ప్రజలకు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. టిడ్కో నివాస గృహాల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే పట్టణ సీఐని పల్లెనిద్ర చేయాలని ఆదేశించామని, త్వరలో తాను కూడా స్వయంగా టిడ్కో గృహాల వద్ద పల్లెనిద్ర చేస్తానని తెలిపారు. టిడ్కో గృహాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నాడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ 52 ఎకరాల సముదాయంలో కట్టిన 4500 ఇళ్ళను అర్హులకే అందించి ప్రజలు ఇక్కడ నివాసం ఉండేలా చర్యలు తీసుకోనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.'

సమాజ హితమే యువ ఇంజనీర్ల లక్ష్యం కావాలి

● మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకు సాగండి

● ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ

● అట్టహాసంగా ఆర్వీఆర్‌జేసీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు(విద్య), జూలై 27: యువ ఇంజనీర్లు సమాజ హితం కోసం పనిచేస్తూ, మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకుసాగాలని ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 36వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. యువత ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా తీసుకుని దాని పరిష్కారం కోసం కృషిచేయాలని రామకృష్ణ అన్నారు. స్వతంత్ర ఆలోచనలు, సమష్టికృషి ఎంతోముఖ్యమని సూచించారు. ప్రపంచస్థాయిలో అంతరిక్ష పరిశ్రమలో 300 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని, ఇందులో భారతదేశ వాటా కేవలం 2శాతం మాత్ర మేనని దీనిని మరింతపెంచేలా నేటి యువత కృషి చేయాలన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందిపుచ్చుకున్నవారికే మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీశ్ కుమార్ మద్దినేని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, డీన్స్, వివిధ శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్రాంచీల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.



చదువులో ప్రతిభ చూపిన విద్యార్థినికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఇస్రో డైరెక్టర్ రామకృష్ణ, ఏఎన్‌యూ వీసీ గంగాధర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

వికటించిన వైద్యం.. ఒకరి మృతి

ఆర్ఎంపీపై పోలీసులకు బంధువుల ఫిర్యాదు



ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి



శ్రీను మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఇన్‌సెట్‌లో శ్రీను మృతదేహం

వినుకొండటౌన్, నూజండ్ల, జూలై 27: వైద్యం వికటించి ఓ రైతుకూలీ మృతి చెందిన సంఘటన వినుకొండలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు సమాచారం మేరకు వివరాలు.. నూజండ్ల మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన తాటి శ్రీను (30) గొర్రెలు కాసుకునేవాడు. ఈ క్రమంలో కాలి బొటన వేలుకు గాయం కాగా బుర్రిపాలెం సమీపంలోని రవ్వారంలోని ఆర్ఎంపీ సిహెచ్.మల్లికార్జునరెడ్డి వద్దకు చికిత్సకు వెళ్లాడు. గాయానికి వైద్యం చేసి, అనంతరం నొప్పికి ఇంజక్షను చేశాడు. కొద్ది సేపటికి శ్రీనుకు ఒళ్ళంతా మంటలు రావడంతో పాటు, ఒంటిపై బొబ్బలు వచ్చి, ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. దీంతో ఆర్ఎంపీ వెంటనే శ్రీనును ఆటోలో వినుకొండ వైద్యశాలకు తరలించాడు. అప్పటికే శ్రీను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, శ్రీను బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ వైద్యశాల వద్దకు చేరుకున్నారు. శ్రీనుకి భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని శ్రీను కుటుంబ సభ్యులు నూజండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరారీలో ఆర్ఎంపీ

శ్రీను మృతి చెందాడని సమాచారం మేరకు బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో ఆర్ఎంపీ అక్కడ నుంచి పరారయ్యాడు. తన బావమరిది సాయంతో రాజీకి ప్రయత్నించినప్పటికీ శ్రీను బంధువులు ససేమిరా అన్నారు. ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ వైద్యవిభాగం జనరల్ సెక్రటరీ.

ఆర్ఎంపీని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే జీవీ

తెలిసీతెలియని వైద్యంతో పేద రైతు కూలీని బలితీసుకున్న ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. జీవీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శ్రీను మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎక్స్పైరీడేట్ ఇంజక్షన్ చేయడంతో అది వికటించి చనిపోయాడన్నారు. జనసేన పార్టీ నాయకులు కొణిజేటి నాగ శ్రీను, మండల అధ్యక్షుడు మురళీకృష్ణయాదవ్, మీసాల ఆంజనేయులు, గరునాథం, సోమేపల్లి బ్రహ్మయ్య, రోడ్డా వీరాంజనేయరెడ్డి, గంగినేని బాబు, ఎర్రయ్య తదితరులు వారి వెంట ఉన్నారు.

తెనాలికి చేరుకున్న హారిక మృతదేహం

● ఈ నెల 20న అమెరికాలో కారు ప్రమాదంలో మృతి

● ఐతానగర్‌లోని స్వగృహం వద్ద అంత్యక్రియలు పూర్తి

● శోకసంద్రంలో మునిగిన కుటుంబీకులు, బంధువులు



తెనాలి ఐతానగర్‌లో హారిక మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్లో హారిక ఫైల్‌ఫోటో

తెనాలి రూరల్, జూలై 27: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెనాలికి చెందిన విద్యార్థిని జెట్టి హారిక(25) అక్కడి హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందింగా ఆమె భౌతికకాయం శనివారం తెనాలికి చేరుకుంది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించేలా సహాయం అందించాలని కుటుంబసభ్యులు కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. దీంతో స్పందించిన వారు తగిన ఏర్పాట్లు చేయగా శనివారం హారిక భౌతికకాయం తెనాలి చేరింది.

తెనాలి ఐతానగర్‌కు చెందిన హారిక గత సంవత్సరం ఆగస్టులో న్యూట్రిషన్ ఫుడ్ సైన్స్‌లో మాస్టర్స్ చేసేందుకు అమెరికా వెళ్లారు. యూనివర్సిటీ నుండి కారులో ఇంటికి వస్తుండగా ఈ నెల 20న కౌంటీలోని ఒకహోమా హైవేపెట్రోల్-74 దగ్గర వరుసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రయాణంలో హారిక అక్కడికక్కడే మరణించింది. కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన ఆమె తండ్రి ఆర్థిక స్తోమతలేకున్నా కూతురి ఉన్నత చదువుల కోసం అప్పుచేసి మరీ అమెరికాకు పంపారు. ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థాయిలో తిరిగివస్తుందని ఆశించిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు హారిక మృతి తీరనిశోకాన్ని మిగిల్చింది. హారిక భౌతికకాయం వద్ద తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబసభ్యులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. దీంతో ఆ ప్రాంతమంతా విషాద చాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలు పూర్తి

అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రమాదవశాస్తూ మృతి చెందిన తాడిబోయిన రవితేజ, జెట్టి హారిక భౌతికకాయాలకు శనివారం అంతిమయాత్ర నిర్వహించి ఆయా కుటుంబసభ్యులు దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఆ కార్యక్రమాలలో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలు మార్గంలో ట్రాఫిక్ బ్లాక్

● రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలుమార్గంలోని విష్ణుపురం-కొండ్రపోలు మధ్యన ట్రాఫిక్‌ని బ్లాక్ చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆయా తేదీల్లో నెం.17646 రేపల్లె-సికింద్రాబాద్ నాలుగు గంటల ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. నెం.17230 సికింద్రాబాద్-త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ 75 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేస్తామన్నారు. నెం.07222 సంత్రగచి-సికింద్రాబాద్ రైలు ఆగస్టు 11న, నెం.07221 సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్ ఆగస్టు 13న నడికుడి మార్గంలో కాకుండా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెం.12805 విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 12, 13 తేదీల్లో మార్గమధ్యంలో 45 నిమిషాల పాటు క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించి రైల్వేకి సహకరించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

కాచిగూడ - తిరువన్నామలై రైలులో చోరీ

● మహిళ మెడలో బంగారు చైన్ లాక్కెళ్లిన దొంగ

రాజుపాలెం, జూలై 27: కాచిగూడ నుంచి తిరువన్నామలై వెళ్ళే రైలులో చోరీ జరిగిన సంఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. నడికూడి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సికింద్రాబాద్‌లోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన బీశెట్టి దేవీప్రియ తన కుటుంబంతో కలసి కాచిగూడ - తిరువన్నామలైలో అరుణాచలం వెళ్తున్నారు. వీరు ఎస్-2 బోగీలో ప్రయాణిస్తున్నారు. రాత్రి 12:50 గంటల సమయంలో ఈ రైలుకు రెడ్డిగూడెంలో క్రాసింగ్ ఉండటంతో రైలు ఆగింది. క్రాసింగ్ అయి పోగానే 12:55, ఒంటి గంట సమయంలో రైలు కదిలింది. ఆ సమయంలో దొంగ చాకచక్యంగా దేవీప్రియ మెడలో ఉన్న 29 గ్రాముల బంగారపు చైన్‌ను తెంచుకొని ట్రెయిన్ దిగి పరారయ్యాడు. ఆమె కేకలువేయటంతో అప్పటికే ట్రెయిన్ కదలటం జరిగిపోయింది. ఈ సంఘటనపై ఆమె గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు నడికూడి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

రాజీకి పిలిచినందుకు దాడి

● ఆరుగురు నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట జూలై 27: కేసు విషయంలో రాజీకి పిలిచినందుకు దాడి చేసిగాయపర్చిన నిందుతులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరల సమావేశంలో నిందుతుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. దోమ రాకేష్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని, దానిలో ఫిర్యాదిదారు అయిన తలవరస విజయ్‌బాబును కేసును రాజీపడమని రాకేష్ పలుమార్లు అడిగాడని తెలిపారు. ఈసారి రాజీకి రమ్మని అడిగితే నిన్ను చంపుతానని విజయ్‌బాబు గతంలో బెదిరించాడు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో సుల్తానాబాదు సుందరయ్య నగర్ కాలనీలో రాకేష్ తన స్నేహితుడు ఏడుకొండలుతో ఉన్న సంగతి తెలుసుకొని విజయ్‌బాబు మిగతా నిందితులను కలుపుకొని రాకేష్‌ను చంపాలనే ఉద్దేశంతో మారణాయుధాలతో దాడి చేశారన్నారు. వారిపై ముకుమ్మడిగా రాడ్లు, కర్రలతో, రాళ్ళతో విచక్షణా రహింతంగా కొట్టగా దోమ రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. రాకేష్‌ను అతని స్నేహితుడు ఏడుకొండలును చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆదే రోజు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం ఏ1 నిందితుడైన తలవరస విజయ్‌బాబు ఇంటిదగ్గర మొత్తం ఆరుగురు నిందుతులను త్రీటౌన్ ఎస్సై ప్రకాష్‌రావు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఈ ఆరుగురు నిందుతులలో ఇద్దరు పలు నేరాలలో నిందుతులని, వారిపై రౌడీషీట్ కూడా ఉందన్నారు. ఇటువంటి వారిపై పీడీ యాక్ట్‌ను, అవసరమైతే నగర బహిష్కరణను కూడా విధిస్తామని హెచ్చరించారు. నిందితులను పట్టుకున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబును, ఎస్సై ప్రకాష్‌రావును, పోలీసు సిబ్బందిని డీఎస్పీ రమేష్ అభినందించారు.

ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), జూలై 27: నల్లపాడులోని ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ అర్హత సాధించకపోయినా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్ జిరాక్స్‌ను జత చేసి కళాశాలలో సమర్పించాలని సూచించారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్కుల జాబితా. పదవ తరగతి టీసీ, 4వ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీలకు రూ.700 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించారు. అదేవిధంగా కళాశాల ఫీజు రూ.4700 చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌కి వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు తప్పకుండా తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఎటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సత్తెనపల్లి టీడీపీ ప్రజా వేదికలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కలాం సేవలు వెలకట్టలేనివి

● వర్ధంతి నేపథ్యంలో కీర్తించిన ప్రముఖులు
● వివిధ ప్రాంతాల్లో చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులు

సత్తెనపల్లి, జూలై 27 : భారత సమాజానికి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అందించిన సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తూ.. యావత్ ప్రపంచానికి అబ్దుల్ కలాం ఆదర్శంగా నిలిచారన్నారు. సాంకేతిక అంతరిక్ష పరిజ్ఞానంలో దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. యువత కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో శనివారం అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సయ్యద్ పెద కరిముల్లా, పూజల వెంకట కోటయ్య, కోమటినేని శ్రీనివాసరావు, అబ్దుల్ నబీ, రాంబో బుడే, జానీ బాషా, మస్తాన్‌వలి, రసూల్, దూదేకే, నాగుల్, ముస్తఫా, షరీఫ్ పాల్గొన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి స్వామి వివేకానంద చైతన్య భారతీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేపీఎస్ శాస్త్రి, డాక్టర్ జీ.శ్రీధర్, సత్యనారాయణ, రవికుమార్, రత్తయ్య, మురళీ, కృష్ణ, లక్ష్మయ్య, ఏజేకే వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగిద్దామని పట్టణ ఎస్ఐ గోపాల్ అన్నారు. అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి ఆధ్వర్యంలో పట్టణంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి యాదవ్, బాబుఖాన్, మన్నెం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో మైనార్టీ నేతలు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ సైదా, టీడీపీ మస్తాన్‌వలి, ముజీబ్, ఆర్‌ఎంపీ మస్తాన్‌వలి, అబ్దుల్ రజాక్, అబ్దుల్ ఘని, వాచర్ బుడే, షేక్ ఫయాజ్, నాగులు, హుస్సేన్, మస్తాన్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని దాచేపల్లి టైలర్స్ అసోసియేషన్ నేత రామకృష్ణ తెలిపారు. యూనియన్ నేతలు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదకూరపాడు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కాకాణి వెంకటరమణ, ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు.

క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలోని డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, ఎంఈవో ప్రసాదరావు, విశ్రాంత హెచ్‌ఎం కర్నాటి కృష్ణారావు, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వలదు

దాచేపల్లి, జూలై 27: సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యంవహించరాదని ఎంపీడీవో వెంకట రమణ అధికారులను కోరారు. శనివారం దాచేపల్లి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల జాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాలతో జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు డయేరియా బారిన పడ్డారని వివరించారు. వ్యాధులు ప్రబలే ప్రాంతాలు, పరిస్థితులను వివరించి, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాలలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలనికోరారు. ఆయా కార్యక్రమాలలో ఈవోపీఆర్డీ జోష్‌రాజు, ప్రభుత్వ వైద్యులు మధు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ప్రత్యేక గ్రామ సభలు

కారంపూడి, జూలై 27: మండలంలోని కారంపూడి, పేటసన్నిగండ్ల, నరమాలపాడు గ్రామాల్లో శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో అధికారులు మాట్లాడుతూ కారంపూడిలో నూరుశాతం మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నరమాలపాడు, పేటసన్నిగండ్ల గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకొని సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా నమోదు కావాలని గ్రామస్థులను కోరారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తామన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ గ్రామ సభల్లో ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

రెంటచింతల, జూలై 27 :రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని అనవసరంగా కూటమి ప్రభుత్వంపై అవాకులు చెవాకులు పేలడం తగదని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు విమర్శించారు. శనివారం గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న యాగంటి రెంటచింతలలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిస్థాయిలో విఫలమైనప్పటికి వాటి గురించి సీఎం కాకుండా సకల శాఖల మంత్రి సజ్జల మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి పాలన ఏ పరిస్థితుల్లో విధిస్తారో తెలియని వ్యక్తి రాష్ట్రపతి పాలన కోరడం విడ్డూరంగా ఉందన్నారు.

కారంపూడికి చేరిన మహాపాదయాత్ర

కారంపూడి, జూలై 27: దుర్గి మండలం అడిగొప్పుల నుంచి తిరుపతికి ప్రారంభమైన టీడీపీ నేతల మహా పాదయాత్ర శనివారం కారంపూడికి చేరింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, మాచర్ల శాసనసభ్యునిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి అఖండ మెజార్టీతో గెలుపొందడంతో టీడీపీ నేతలు పాదయాత్ర చేపట్టినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. పాదయాత్రగా కారంపూడికి చేరుకున్న నేతలకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.

2,595 మందికి కుష్టువ్యాధి పరీక్షలు

రెంటచింతల,జూలై 27 : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నాటికి 2,595 మందికి కుష్టువ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 691 గృహలను సందర్శించి పరీక్షలు నిర్వహించగా వారిలో 12 మందికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యాధిసోకిన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. ఈ సర్వేలో ఎంపీహెచ్‌ఈవో శర్మ,ఆంజనేయులు, సూపర్ వైజర్లు కోటేశ్వరరావు, మహేష్, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాది రూత్ బనియన్ తదితరులు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

పిడుగురాళ్ల, జూలై 27: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై వుందని మాజీ ఏజీపీ, సీనియర్ న్యాయవాది ఆదూరి రూత్‌బనియన్ అన్నారు. కార్డ్‌సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కులు - నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లెనిన్‌నగర్‌లోని కార్డ్ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని ఎస్సీ కాలనీల్లో విద్య-సామాజిక చైతన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది రాజశేఖర్, బంకా విజయకుమార్, హెచ్‌ఎం పీ.లత, బాలబాట ఏసీవో విజయకుమార్, గడ్డం శామ్యూల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1200 కుటుంబాలకు పదిరకాల కూరగాయల విత్తనాలను కార్డ్ సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

● గ్రామాలలో ప్రతి రోజు ఇంటింటి సర్వే నిర్వహించండి
● వైద్య సిబ్బందిని ఆదేశించిన డీఎంహెచ్‌వో రవి
● డయేరియా బాధితులకు పరామర్శ
● ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం



ఆరోగ్య, పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

మాచవరం, జూలై 27: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు వున్నాయని, ఆయా గ్రామాల్లోని ఆశ వర్కర్లు, ఎఎన్‌ఎంలు, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) రవి స్థానిక అధికారులను ఆదేశించారు. శనివారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన 'మాచవరంలో ప్రబలిన డయేరియా' అనే వార్తపై స్పందించిన డీఎంహెచ్‌వో శనివారం మాచవరం గ్రామానికి చేరుకొని డయేరియా బాధితుల గృహాలకు వెళ్లి వారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న వారిని డీఎంహెచ్‌వో పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామంలోని డయేరియా ప్రబలిన వీధులను పరిశీలించి ఆరోగ్య, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఒక వీధిలో నీటి తొట్టిలో పాచిపేరుకుపోయి వుండటాన్ని గమనించిన డీఎంహెచ్‌వో ఆశ వర్కర్లను, ఎఎన్‌ఎంలను ప్రశ్నించారు. ఇంటింటి సర్వే చేశారా లేదా? చేస్తే మంచి నీటి తొట్టిలో పాచిపేరుకు పోయిన విషయం మీకు కనపడలేదా? వారికి శుభ్రపరచుకోమని ఎందుకు చెప్పలేదు? అని ప్రశ్నిస్తూ వారిపై అసహనం వ్యక్తం చేశారు. డయేరియా లక్షణాలతో బాధపడుతున్న కోట పద్మ, అత్తలూరి ఏసు, అత్తలూరి నరసింహారావు ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆశవర్కర్లు, ఎఎన్‌ఎంలు వారివారి పరిధిలోని గృహాలకు వెళ్లి ఇంటింటి సర్వే నిర్వహించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరవేయాలన్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటినే తాగాలని, రాత్రి సమయాలలో దోమ తెరలు ఉపయోగించాలని, వీధుల వెంట మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని, మురుగు కాల్వల్లో మంచినీటి పైపులు లేకుండా చూడాలని, నీరు పారుదలకు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. అదేవిధంగా మురికి కుంటల్లో ఎబెట్ మందును పిచికారి చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాల ఎఎన్‌ఎంలను, ఆశ వర్కర్లను అప్రమత్తంగా వుండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాచవరం పంచాయతీ ఆధ్వర్యంలో వీధుల వెంట, సైడు కాల్వల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. కార్యక్రమంలో వెంట వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్, ఎంపీడీవో సురేష్, ఈవోఆర్‌డి వెంగళరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సురేష్, సర్పంచ్ నరేష్, సెక్రటరీ శ్రీనివాసరావు, గౌసియా, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పాచిపట్టిన నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సత్తెనపల్లి, జూలై 27 : పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష మీడియం స్కూల్ ఆవరణలో శనివారం విద్యార్థులకు, అధ్యాపకులకు అగ్ని ప్రమాదాలపై స్థానిక అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిమోద్వారా వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులతో డెమో చేయించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు, ఆలా శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సిస్టర్ విజయ రాణి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

మాచర్లటౌన్, జూలై 27: పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. పట్టణాన్ని క్లీన్ మాచర్ల.. గ్రీన్ మాచర్లగా అభివృద్ధి చేసుకుందామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆర్వో హుస్సేన్‌ఖాన్, ఆర్ఐ లింగయ్య, టీపీఎస్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దాచేపల్లికి యరపతినేని రాక

దాచేపల్లి, జూలై 27: దాచేపల్లిలో మహాలక్ష్మీ అమ్మవారి బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం దాచేపల్లి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ భద్రి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. ఆదివారంతో ముగియనున్న బోనాల కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలిరానున్నట్లు తెలిపారు.

రాజానగరం సర్పంచ్‌గా రమేష్

దుర్గి, జూలై 27: మండలంలోని రాజానగరం గ్రామ సర్పంచ్‌గా జక్కా రమేష్ తిరిగి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్‌గా రమేష్ రెండేళ్లపాటు వ్యవహరించగా అనంతరం సెలవుపై వెళ్లారు. దీంతో శివరాం ఏడాది పాటు సర్పంచ్‌గా వ్యవహరించారు. తిరిగి రమేష్ శనివారం సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు, సిబ్బంది రమేష్‌ను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ వలి, పంచాయతీ కార్యదర్శి షేక్ మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

నకరికల్లు, జూలై 27 : మండల పరిధిలోని కుంకలగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మొక్కలు నాటారు. 'శిక్ష సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం కే మేరీ రాణి, ఉపాధ్యాయులు, మెడికల్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.పూజాశ్రీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కుంకలగుంట జడ్పీ హైస్కూల్, మెయిన్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో కుంకలగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.పూజాశ్రీ, హెచ్‌వీ ప్రశాంతకుమారి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిసాఫ్ట్‌బాల్ పోటీలకు క్రోసూరు విద్యార్థులు

క్రోసూరు, జూలై 27 : రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పఠాన్ ఇబ్రహీం ఖలీల్, గుంటూరు తనూజ, కంభంపాటి దీవెన ఏంజల్, గారుమంచి పూజిత ఎంపికయ్యారని ప్రధాపాధ్యాయురాలు సిస్టర్ మేరీ రజిత తెలిపారు. ఆగస్టు 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన వారు పాల్గొంటారని తెలిపారు.

న్యూటన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

మాచర్ల రూరల్, జూలై 27: మండల పరిధిలోని అలుగురాజుపల్లిలోగల న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న వై.రాజేష్‌కు తమిళనాడురాష్ట్రం చెన్నైకి చెందిన వెల్‌టెక్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రధానం చేసింది. 'యాన్ ఎఫెక్టివ్ రౌటింగ్ మెథడ్ ఫర్ సెక్యూటర్ డాటా ట్రాన్స్‌మిషన్ యూజింగ్ గ్రూప్ కీ మేనేజ్‌మెంట్ ఇన్ మానెట్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను రాజేష్‌కు పీహెచ్‌డీ లభించింది ఈ సందర్భంగా శనివారం న్యూటన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, హెచ్‌వోడీ నరేష్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది వై.రాజేష్‌ను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీకి విరాళం

మాచర్లటౌన్, జూలై 27: పట్టణంలోని పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం పేద విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీకి రూ. 15 వేలను విరాళంగా అందించారు. ఆస్పత్రి చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య ఈ నగదును ఆర్టీసీ బ్యాంకు ఖాతాలో జమచేశారు. ఆర్టీసీ సూపర్ వైజర్ లాలునాయక్ ఈసందర్భంగా కృష్ణయ్యకు, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సెక్రటరీ డాక్టర్ మురహరిరావు, డైరెక్టర్లు నరసింహారావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, గోపిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల పాదయాత్రకు సంఘీబావం

మాచర్లటౌన్, జూలై 27: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యునిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో టీడీపీ నేతలు పలువురు దుర్గి మండలం అడిగొప్పుల నుంచి తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శనివారంకు గుత్తికొండకు చేరింది. టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు శనివారం గుత్తికొండలో టీడీపీ నేతలను కలిసి పాదయాత్రకు సంఘీబావం తెలిపారు.



జనసేన సభ్యత్వాన్ని అందిస్తున్న రామాంజనేయులు

జనసేన సభ్యత్వ నమోదు

మాచర్లటౌన్, జూలై 27: పట్టణంలోని పార్కు సెంటర్లో శనివారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసాని రామాంజనేయులు ఆధ్వర్యాన జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వాలను స్వీకరించారు. కార్యక్రమంలో గుండాల రవి, మదీన్, అనిల్, లాల్ కృష్ణ, శ్రీహరి, షారుఖ్, నరేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌కు పర్యావరణ వేత్త జాజి

కారంపూడి, జూలై 27: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని ఆదర్శ బీఫార్మసీ కళాశాలలో శనివారం అడవుల సంరక్షణ, ప్రకృతిపై నిర్వహించిన జాతీయ సెమినార్‌కు కారంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) హాజరయ్యారు. ప్రకృతి, అడవుల సంరక్షణ, వృద్ధి అంశంపై జాజీ ప్రసంగించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కనకరాజు, ప్రిన్సిపాల్ శ్రీనాథరావు, సెక్రటరీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ స్టిక్స్, లంబార్ బెల్టులు పంపిణీ

అచ్చంపేట, జూలై 27 : మండలంలోని పెదపాలెం పీహెచ్‌సీలో డాక్టర్ రాంబాబునాయక్ చేతులమీదుగా ఫ్లోరోసిస్, ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి శనివారం వాకింగ్ స్టిక్స్, నెక్, లంబార్ బెల్టులు పంపిణీచేశారు. జాతీయఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉపకరణాలను అందజేసినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి పీ.వెంకటరావు, రాధాకృష్ణ, హెచ్‌ఎం మహబూబ్ సుభానీ, సీహెచ్‌వో శివనాగమణి పాల్గొన్నారు.

ఎర్రకుంట భూమిలో హెచ్చరిక బోర్డు

● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు

కారంపూడి, జూలై 27: 'ఎర్రకుంటపై మళ్లీ కబ్జాదారుల కన్ను' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కీర్తి సుధాస్రవంతి వీఆర్వో కృష్ణప్రసాద్‌తో కలిసి వినుకొండ రోడ్డులోని ఎర్రకుంట భూమిని పరిశీలించి, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే అక్కడ ఉండవలసిన భూమి, రికార్డులో ఉన్న భూమి కంటే తక్కువగా ఉండడంతో కొలతలు నిర్వహించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కీర్తి సుధాస్రవంతి సర్వేయర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతలు అనంతరం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడినా, అక్రమ కట్టడాలు నిర్మించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ భూమిపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎర్రకుంట భూమి పక్కనే పెట్రోలు బంకు ఏర్పడుతుండడంతో భూమికి గిరాకీ పెరిగిందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పశువుల దాహార్తి తీరుస్తున్న ఈ భూమిని కబ్జా చేసి విక్రయించాలని కొంతమంది ప్రయత్నాలు ప్రారంభించారని ఈ ప్రాంత వాసుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలోనూ కథనం ప్రచురితం కావడంతో తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు.



ఎర్రకుంట భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్



శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదు శనివారం గుంటూరులోని తన ఇంటికి ఆహ్వానించి శాలువాతో ఘనంగాసత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎంవీవీ వరప్రసాద్ పాల్గొన్నారు. - పెదకూరపాడు

పాల ఉత్పత్తిదారులకు అండగా సంగం డెయిరీ

నకరికల్లు, జూలై 27 : పాల ఉత్పత్తి దారులకు సంగం డెయిరీ అండగా ఉంటుందని సంగం డెయిరీ మేనేజర్ వీరంద్ర కుమార్ అన్నారు. శనివారం నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో వంకాయలపాటి జగ్గారావు మృతి చెందారు. సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుడైన జగ్గారావు భార్య మరియకుమారికి శనివారం రూ.50వేల చెక్కును సంగం డెయిరీ ప్రతినిధులు అందించారు. అదే గ్రామానికి చెందిన ఎం.శివలింగం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో భూపతిరాజు, ఆంజనేయులు, బత్తినేని బ్రహ్మయ్య, ముప్పాళ్ళ ఆంజనేయులు, పచ్చల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు పాలన

బెల్లంకొండ, జూలై 27 : అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన కొనసాగుతోందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. మండల కేంద్రం బెల్లంకొండలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెల్లంకొండ మండలం పూర్తిగా వెనుకబడిందని, మండలంలోని సమస్యల పరిష్కారానికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఒక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రకటించటంపై సంతోషం వ్యక్తం చేశారు. సమావే శంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, గుడిసె కొండయ్య, మేళం శ్రీరామమూర్తి, సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ సుభానీ, ఇబ్రహీం, గుంజా శివ, ఒర్సు రాంబాబు, ఎన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న పంచాయతీ కార్మికులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలి

పెదకూరపాడు, జూలై 27 : పరిసరరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అప్పుడే దోమలు రాకుండా ఉంటాయని ఎంపీడీవో పీ మల్లేశ్వరి అన్నారు. పెదకూరపాడులో శనివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులతో మురుగు కాలువల్లోని పూడికను రోడ్ల పక్కన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వీధులు శుభ్రంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఫ్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్ గుడిపూడి రాజు, ఎంపీడీవో కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుధారాణిపాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులకు యూనిఫాంలు పంపిణీ చేశారు.

విశ్రాంత హెచ్‌ఎంకు ఘన సత్కారం

క్రోసూరు, జూలై 27: మండలంలోని హసానాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దుగ్గరాజు సుధాకరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఆయనను, ఆయన సతీమణి నీరజను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో ఏసుబాబు సుధాకరరావు ఉపాధ్యాయ ఉద్యోగ జీవితంలో మచ్చలేనిదని అన్నారు. అనంతరం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పలువురు సుధాకరరావుకి శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపికలను అందజేశారు.

ఈతకు దిగి మిర్చియార్డు ఉద్యోగి మృత్యువాత

● సాగర్ కుడికాలువలో మృతదేహం లభ్యం

మాచర్లరూరల్, జూలై 27: కుడి కాలువలో ఈతకు దిగి ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి చెందిన వక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని 30వవార్డుకు చెందిన శెట్టిగోపి(32) గుంటూరు మిర్చియార్డులో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కారులో నాగార్జునసాగర్ విహారయాత్రకు వచ్చారు. సాగర్, ఎత్తిపోతల తదితర ప్రాంతాలను సందర్శించి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద కారును నిలిపి గోపి ఈత కొట్టేందుకు కుడి కాలువలో దిగాడు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కాలువలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య తన సిబ్బందితో కలిసి కుడి కాలువలో గాలింపు చేపట్టారు. శనివారం గోపి మృతదేహం తాళ్లపల్లి వద్ద కుడికాలువలో లభ్యమైంది. మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.



ఇసుక రీచ్ వద్ద నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

ఇసుక లోడింగ్ నిర్వహణ అస్తవ్యస్తం

● లారీ డ్రైవరులపై దాడిచేసిన గేదల కాపరులు
● నిరసనతో సాయంత్రం వరకు నిలిచిపోయిన ఇసుక లోడింగ్
● దళారుల ప్రమేయాన్ని నిలువరించాలని డిమాండ్

అమరావతి, జూలై 27: మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్ వద్ద గల స్టాక్ పాయింట్ వద్ద జరుగుతున్న ఇసుక బుకింగ్, లోడింగ్ ప్రక్రియ అధికారుల అలసత్వంతో రసాభాసగా మారుతోంది. బుకింగ్ కౌంటర్ వద్ద పర్యవేక్షణ సిబ్బంది, వాహనాలను క్యూ నిర్వహించే పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఘర్షణలు జరగడం, ఇసుక బుకింగ్‌లో దళారులు రంగ ప్రవేశం చేసి అధిక మొత్తంలో బిల్లులు అమ్ముకోవడం జరుగుతుంది.

శనివారం ఇసుక లోడింగ్‌కు వచ్చిన వాహనాలు రీచ్ వద్ద బారులు తీరి ఉన్నాయి. ఆ సందర్భంలో కృష్ణానదిలోని లంక భూములలో మేతకు వేళ్లే గేదెలు ఆ వైపుగా వెలుతున్నాయి. అయితే తమ గేదలు వెళ్లేందుకు వాహనాలు అడ్డుపెట్టారన్న ఆగ్రహంతో గేదెల కాపరులు, స్థానికులు కలిసి నలుగురు డ్రైవర్‌లపై దాడి చేశారు. దీంతో లారీడ్రైవర్‌లు వాహనాలకు లారీని అడ్డుగా పెట్టి ఇసుక వాహనాలు వెళ్లకుండా నిరసనకు దిగారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఇసుక రవాణా నిలిచిపోయింది. మరోవైపున ఇసుక లోడింగ్ వద్ద స్థానికులు తమ వాహనాలకు ముందు లోడింగ్ చేయాలని అడ్డుతగులుతూ రోజుకు నాలుగుసార్లు లోడింగ్ చేసుకుని అమ్ముకుంటున్నారని బయటనుండి వచ్చిన వాహనాలకు రెండు రోజులైనా లోడింగ్ జరుగుటలేదని లారీడ్రైవర్‌లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విధంగా తాము ఇబ్బందులు పడుతుంటే తమ మీద స్థానికులు దాడులు చేయడం ఏంటని డ్రైవర్‌లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి స్టాక్ పాయింట్ వద్ద వాహనాల క్యూని సరైనవిధంగా పర్యవేక్షించాలని, దళారులకు కాకుండా వాహనలకు చెందిన డ్రైవర్‌లకు ఇసుక బుకింగ్‌కు ప్రాధాన్యం కల్పించాలని వాహన డ్రైవర్లు కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ఎం అశోక్‌కుమార్

పండ్ల తోటల విస్తరణకు ప్రత్యేక కృషి

● జాయింట్ కమిషనర్ ఎం అశోక్‌కుమార్

నరసరావుపేట రూరల్, జూలై 27: పల్నాడు జిల్లాలో పండ్ల తోటల విస్తరణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జాయింట్ కమిషనర్ (హార్టికల్చర్) ఎం అశోక్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన, రాయితీ తదతర అంశాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమా వేశంలో జిల్లా ఉపాధిహామీ పథకం జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో ప్రతి మం డలంలో సుమారుగా 200 ఎకరాలకు తగ్గకుండా పండ్లతోటల విస్తీర్ణం పెరిగేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పల్నాడు జిల్లాలో మొత్తం 5600 ఎకరాల పండ్లతోటల సాగు సెప్టెంబరు నాటికి లక్ష్యంగా అధికారులందరూ పనిచేయాల న్నారు. కార్యక్రమంలో పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్, సీహెచ్ రమణారెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో పంచాయతీలకు పునర్వైభవం

కారుమంచి(శావల్యాపురం), జూలై 27: కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు పునర్వైభవం చేకూరనుందని కారుమంచి టీడీపీ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను ఏర్పాటు చేయాలన్న కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చిత్రపటాలను టీడీపీ గ్రామ అధ్యక్షుడు గిరిప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోట హరిబాబులు పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావుకు శనివారం కానుకగా సమర్పించారు. ఎంపీటీసీ యూనిట్ ఇన్చార్జి హరిబాబు మాట్లాడుతూ దేశానికే పట్టుగొమ్మలైన గ్రామాలను అభివృద్ధిపథంలో తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ మల్లాపరపు గాలెయ్య, షేక్ మహమ్మద్, ఐమాల నాగరాజు, నాదెండ్ల నరసింహారావు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సంగం డెయిరీ తోడ్పాటు

● వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ ఆంజనేయులు



ఇర్లపాడులో బోనసు అందజేస్తున్న సంగండెయిరీ అధికారులు

ఇర్లపాడు(శావల్యాపురం), జూలై 27: పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో వారికి అనేక రకాల రాయితీలు, బోనసులను పంపిణీ చేస్తూ సంగం డెయిరీ ఎంతో తోడ్పాటునందిస్తుందని వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఇర్లపాడులోని ఎంపీఐ సెంటర్లో బోనసుల పంపిణీ కార్యక్రమాన్ని సంగం డెయిరీ అధికారులు శనివారం నిర్వహించారు. సెంటర్లోని 43 మంది పాలఉత్పత్తిదారులకు మొత్తం రూ.3,43,783లను బోనసుగా పంపిణీ చేశారు. వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు మాట్లాడు తూ పాలఉత్పత్తిదారులకు ఉచితం గా పశు వైద్యసేవలు, రాయితీలపై పశుగ్రాసం, దాణా, మిక్చర్‌లను సంగండెయిరీ అందిస్తుందని, పశువులతో పాటు పాలఉత్పత్తిదారులకు కూడా భీమా పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇర్లపాడులో పాలఉత్పత్తిదారులకు రూ.100కి రూ.7 చొప్పున బోనసును పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సెంటర్ అధ్యక్షుడు సాంబశివరావు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఫీల్డ్ కోఆర్డినేటర్ రామకోటయ్య పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించాలి

● అయినవోలు సాంబశివరావు

నరసరావుపేట టౌన్, జూలై 27: ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహి స్తూ ప్రజలలో మమేకమైన ఆర్యవైశ్యులకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసే కార్పొరేషన్లు, దేవాలయ ట్రస్ట్ బోర్డులు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అయినోలు సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా, వైద్యరంగంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అనేక సేవలు అందిస్తున్నామన్నారు. వ్యాపార రంగంలో అనేక వ్యాపారాలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారికి పన్నుల రూపంలో సహకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అనేక దేవాలయాలు, నిత్యాన్నదాన సత్రాలు, వృద్ధాశ్రమాలు, అనాధ శరణాలయాలు నిర్వహిస్తున్నామన్నారు. కూటమి గెలుపులో ఆర్యవైశ్యుల పాత్ర ప్రముఖమైందన్నారు. రాజకీయంగా ఆర్యవైశ్యులను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మా అభ్యర్థనను మన్నించి నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలని కోరారు.

చెరువులో అక్రమంగా చేపలు పడుతున్నారు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

ఈపూరు, జూలై 27: చెరువులో చేపలు అక్రమంగా పట్టుకునేందుకు గ్రామంలోని కొందరు ప్రయత్నిస్తున్నారని మండలంలోని కొచ్చెర్ల గ్రామస్థులు శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు. గ్రామ సొసైటీకి చెందిన చెరువును పాట ద్వారా లీజుకు తీసుకున్న వాళ్లు గతంలో చేపలు పెంచుకొని పట్టుకున్నారన్నారు. ప్రస్తుతం సమయం గడిచినప్పటికీ సొసైటీ సభ్యులకు చెప్పకుండా చెరువు నీటిని బయటకు పంపుచున్నారని, ఎక్స్‌కవరేటర్‌తో గండిపెట్టేందుకు ప్రయత్నించారని చేపల చెరువు సొసైటీ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పిర్యాదు చేశారు.

ఆస్తి కోసం తల్లిపై కొడుకు, కోడలు దాడి

వినుకొండటౌన్, జూలై 27: ఆస్తి పంచలేదని తల్లిపై. పెద్ద కుమారుడు, కోడలు దాడిచేసిన ఘటన పట్టణంలోని ఇందిరానగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితురాలు ఒంగోలు గోవిందమ్మ వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్సపొందుతూ తెలిపిన వివరాలను పరిశీలిస్తే, గోవిందమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు పాపాచారి, కోడలు నాగలక్ష్మీలు నిత్యం ఆస్తి కోసం వేధిస్తూ, దాడులకు పాల్పడుతున్నారని, గతంలో రోకలి బండతో హత్యాయత్నానికి పాల్పడ్డారని ఈ నెల 17తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదనింది. శుక్రవారం రాత్రి ఇంటి తలుపులు తన్ని దాడికి పాల్పడ్డారని, సమీపంలో ఉన్న మరో ఇద్దరు కుమారులు ఒక కోడలు సాయంతో చికిత్స పొందుతున్నానని ఆమె తెలిపింది. కొడుకు, కోడలు వేధింపుల నుంచి పోలీసులు రక్షణ కల్పించాలని ఆమె కోరింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వినుకొండటౌన్, జూలై 27: ద్విచక్రం వాహనం ఢీకొని, ప్రక్కనే ఉన్న ఫోర్‌వీల్ ఆటోకి తగలడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ వద్ద శనివారం జరిగింది. వివరాలను పరిశీలిస్తే ముండ్లమూరు బస్టాండ్‌లో వద్ద ఆపరాల షాపులో గుమస్తాగా పనిచేస్తున్న మాదాల సురేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వెనుక నుంచి వేగంతో వస్తున్న మరో ద్విచక్రవాహనం సురేష్ వాహనాన్ని ఢీకొట్టడంతో, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ఆటోకు తగలడంతో గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న షాపు యజమాని గట్టుపల్లి శ్రీనివాసరావు బాధితుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చికిత్స పొందుతున్న సురేష్‌ను పరామర్శించి, కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

ఆటో ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలకు గాయాలు

వినుకొండటౌన్, జూలై 27: ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు మహిళలకు గాయాలైన ఘటన నర్సరావుపేట రోడ్డులోని సర్వీసింగ్ స్టేషన్ వద్ద శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే స్థానిక గంగినేని కల్యాణ మండపం ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ సూపర్‌వైజరుగా విధులు నిర్వహిస్తున్న బత్తిన శ్రీదేవి, అపార్టుమెంట్‌లో పనిచేస్తున్న నిర్మల విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికెళ్తుండగా, ఆటో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిర్మల పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరుకు తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భాధితుల బంధువులు తెలిపారు.

ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసరావు

చిలకలూరిపేట, జూలై 27 : ఎస్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్‌గా పట్టణంలోని మద్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పోటు శ్రీనివాసరావును ఆ సంఘం నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావును సంఘం నాయకులు శనివారం అభినందించారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 27: నియోజవర్గంలో పారిశుధ్య పనుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం పట్టణంలో మున్సిపల్ సచివాలయ శానిటేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కొద్ది రోజులుగా వర్షాలు త్రీవంగా పడుతున్న నేపథ్యంలో వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై పారుతోందని, ఫలితంగా దోమలు వ్యాపిస్తున్నాయనే ఫిర్యాదులు ప్రజల నుంచి ఎక్కువగా వస్తున్నట్లు వివరించారు. ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకునే బాధ్యతయుతమైన స్థానంలో మనం ఉన్నందున ఎప్పుడూ ప్రజల కోసం ముందుండి పని చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ మన ఇంటి నుంచే మొదలవ్వాలని గాంధీ చెప్పారన్నారు. ఆ సూత్రాన్ని నా ఆస్పత్రి విషయంలో శ్రద్ధగా పాటించాలన్నారు. సచివాలయం నుంచి మీరు ప్రారంభిస్తే మీ ప్రాంతం మొత్తం బాగుపడుతుందన్నారు. సమస్య ఎక్కడైనా ఉంటే తక్షణమే అధికారులకు వివరించాలని, అవసరమైతే నేను కూడా రంగంలోకి దిగి చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ భవన నిర్మాణాల విషయంలో కూడా కచ్చితంగా చట్టం పాటించాల్సిందే అన్నారు. సైడ్ కాలువల విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించిందని అన్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు తొలగింపుపై దృష్టి పెట్టాలన్నారు. శానిటేషన్ సిబ్బందిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా పని చేయక పోయినా కొంత కాలం వేచి చూస్తానని, అప్పటికీ చేయకుంటే మాత్రం చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర అభివృద్ధికి యువత పాత్ర అత్యంత కీలకమైనదని, ఎవరో చెప్పే వరకు కాకుండా అభివృద్ధిపై మీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పని చేసిన సిబ్బందికి అవార్డులు, రివార్డులు ఇచ్చేలా చూసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, వాసిరెడ్డి రవి, కొప్పూరు బాబు, మాస్తాన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ. జూలై 27: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు చేతుల మీదుగా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈదేశానికి ఏనలేని సేవచేశారని, భారతదేశంలో పేదరిక నిర్మూలన జరగాలని గొప్ప ఆశయంతో ముందుకు నడిచిన వ్యక్తి అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని మాజీ ఎమ్మెల్యే మక్కెన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పఠాన్ ఆయూబ్‌ఖాన్, రియల్ ఎస్టేట్ జానీ, గుంజరి కాళంగి రాజు, గంగినేని ఆంజనేయులు, కుంట కోటిరెడ్డి, ఈశ్వరయ్య, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం ఆదర్శం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 27 : ప్రతి విద్యార్థికి ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టినప్పటికీ పట్టువిడువని విక్రమార్కుడిలా కష్టపడి అంచెలంచెలుగా ఎదిగిన క్రమం అద్భుతమన్నారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా నుంచి రాష్ట్రపతి వరకు కలాం దేశం కోసం చేసిన సేవను ఎల్లప్పుడు మనం స్మరించుకోవాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్, జూలై 27: అందరికీ ఆదర్శనీయుడు, స్ఫూర్తి ప్రదాత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని పల్నాడు బస్టాండు వద్ద గల మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

చిలకలూరిపేట, జూలై 27 : అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతుబజారు ఎదురుగా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నూజెండ్ల, జూలై 27 : మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం అఖిల్, కలాం థెరిసా సేవా సొసైటీ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి, నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి చేసిన సేవలను కొనియాడి నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ



స్టాప్ డయేరియాపై ఏనుగుపాలెంలో అవగాహన ర్యాలీ

వినుకొండ, జూలై 27: మండలంలోని ఏనుగుపాలెంలో గ్రామ సర్పంచి మాదినేని వెంకటలక్ష్మి, ఆంజనేయులు ఆధ్వర్యంలో స్టాప్ డయేరియాపై శనివారం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ అవగాహన సదస్సులో మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు, ఒడియాప్లస్ ద్వారా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కట్టించుకోవాలని, దీనిద్వారా డయేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి గుమ్మ రామాంజమ్మ, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, చందు, దేవిక, ఆశ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో కాంచన అకాడమికి 11 పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ ఎం రవిశంకర్, అకాడమి డైరెక్టర్ కాంచన

నరసరావుపేట కల్చరల్, జూలై, 27. ఇటీవల గుంటూరు జిల్లా పల్లెకోనలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన కాంచన అకాడమి విద్యార్థులు 11 పతకాలు సాధించారని అకాడమి డైరెక్టర్ ఎం కాంచన శనివారం తెలిపారు. అకాడమికి విద్యార్థులు 11 మంది ఏడు స్వర్ణం, రెండు రజతం, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకాడమీలో జరిగిన సభలో అభినందించారు. పతకాలు సాధించేలా తర్ఫీదునిచ్చిన కోచ్ ఎం. రవి శంకర్‌ను అభినందించారు.

ప్రత్యేక ఆధార్‌కేంద్రం ఏర్పాటు

నరసరావుపేట రూరల్, జూలై 27: మండలంలోని లింగంగుంట్ల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆధార్ క్యాంపులో 74 మందికి అప్‌డేట్ చేశారన్నారు. ఈ క్యాంపులో 0-5 సంవత్సరాల పిల్లలకు, ఇంటి డోర్ నెంబర్లు మార్పు, అడ్రస్‌లు ఆధార్‌లో మార్పులు తదితర సేవలందిదిస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది బ్రహ్మయ్య, సుబ్బయ్య, గోవర్ధన్, శ్రీలక్ష్మి, పార్వతి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురికిపూడి హాస్టల్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

చిలకలూరిపేట, జూలై 27 : మండలంలోని మురికిపూడి గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉన్న ఖాళీలకు సంబంధించి స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ కే రాజబాబు శనివారం తెలిపారు. హాస్టల్‌లో ఎస్సీలకు 12, ఎస్టీలకు 3, ఓసీలకు 4 ఖాళీలు ఉన్నట్లు ఆయన వివరించారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. వివరాలకు 7416516599 నెంబరును సంప్రదించి స్పాట్ అడ్మిషన్‌లు పొందవచ్చునని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

చిలకలూరిపేట, జూలై 27 : ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులను చెల్లించటానికి అవకాశం కల్పించినట్టు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ శనివారం తెలిపారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న ఈఆర్‌వో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి బిల్లులను స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఒకరిపై పోక్సో కేసు

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అధికారులు

నాదెండ్ల, జూలై 27: మండలంలోని గణపవరంలో బాలికపై గ్రామానికి చెందిన షేక్ మౌలాలి అనే వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి చికెన్ దుకాణంలో పని చేసే సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న షేక్ మౌలాలి బాలికను షాపులోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఆ వృద్ధుడిని నిలదీశారు. భయంతో అతడు పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ బాలరామిరెడ్డిలు బాలికకు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించారు. కాగా జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీపతి గ్రామాన్ని సందర్శించారు. జరిగిన ఘటన గురించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటు సీఐ శ్రీనివాసరెడ్డి, బాలరామిరెడ్డిలు ఉన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి కౌన్సిలర్ శ్రీనివాసరావు, సీడీపీవో శాంతకుమారి బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

బొల్లాపల్లి, జూలై 27 : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, జడ్పీ హెచ్ఎస్ బండ్లమోటు నందు గల 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాల బాలికలకు ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు పరిధిలో మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా చట్టాల గురించి, బాలల హక్కుల గురించి, అక్రమ రవాణా, బాల్యం వివాహం నిరోధక చట్టం -2006, లైంగిక నేరాల నుంచి కాపాడటానికి బాలల రక్షణ చట్టం 2012 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అరుణ, ఎంఈవో పార్వతి, ఈవోపీఆర్‌డీ జిలానీ బాషా, బాలబాలికలు, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

శావల్యాపురం, జూలై 27: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన మల్లాపరపు రవికుమార్‌ను నియమిస్తూ మండలి ప్రెసిడెంట్ బుల్లా రాజారావ్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రెండ్రోజుల క్రితం జరిగిన సమావేశం లో రవికుమార్‌కు ప్రెసిడెంట్ రాజారావ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. రవికుమార్ గతంలో శావల్యాపురం జడ్పీటీసీగా బాధ్యతలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎస్సీ ఎస్టీలందరికీ అందేలా కృషి చేస్తానని, ఎస్సీ, ఎస్టీలను సమైక్యపరచి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను పలువురు అభినందించారు.

మొక్కలను సంరక్షించిన విద్యార్థులకు ఫీజు రాయితీ

శావల్యాపురం, జూలై 27: మొక్కల సంరక్షణపై విద్యార్థులు ఆసక్తి చూపేందుకు పాఠశాల ఫీజులో రాయితీని ప్రకటిస్తూ శ్రీరామపబ్లిక్ స్కూల్ యాజమాన్యం వినూత్నంగా చేపట్టిన విధానం అభినందనీయమని ఎంఈవో సాంబశివరావు అన్నారు. శావల్యాపురంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్లో మొక్కలు నాటుదాం-ప్రకృతిని రక్షిద్దాం నినాదంతో విద్యార్థులు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

మోడల్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

రొంపిచర్ల, జూలై 27: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొ న్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీడీవో

ఈపూరు, జూలై 27: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ) 4వ వార్షికోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షాసప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా శనివారం ఈపూరు హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటా రు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాళ్ల అమ్మకు అంకితం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణా రెడ్డి, ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్, ఏపీఏ లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండవీడుకోట అభివృద్ధిపై సమీక్షిస్తాం



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న కల్లి శివారెడ్డి

యడ్లపాడు, జూలై 27: కొండవీడుకోట అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారని కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు. శనివారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలిసిన శివారెడ్డి కొండవీడుకోటలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మా ట్లాడుతూ కొండవీడుకోటలో నిర్మించిన ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన శివాల యం పునర్నిర్మాణం ప్రారంభంలోనే నిలిచిపోయిందని, వెంటనే పునర్నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి త్వరలోనే సమీక్ష నిర్వహించి అసంపూర్తిగా మిగిలిపోయిన పనులతోపాటు అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా కొండవీడుకోటను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలా గే కొండవీడు హెరిటేజ్ కమిటీ ఏటా కొండవీడుకు సంబంధించిన గ్రంథాన్ని ప్రచురిస్తున్నదని, దానిలో భాగంగా కాటయ వేమారెడ్డి వ్యాఖ్యానంతో కూడిన కాళిదాస శాకుంతలాన్ని కొండవీడు హెరిటేజ్ సొసైటీ పునఃముద్రణ చేయిస్తున్నదన్నారు. త్వరలోనే పునఃముద్రణ కార్యక్రమాలను పూర్తిచేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరిస్తామన్నారు. అందుకు ప్రత్తిపాటి అంగీకరించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రయాణంలో హెల్మెట్ తప్పని సరి

● ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారధి



హెల్మెట్ వాడకంపై అవగాహన చేస్తున్న జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారధి

వినుకొండ, జూలై 27: ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ ఆథారిటీ అమరావతి వారి సూచన మేరకు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ప్రమాదాల నివారణపై న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు శనివారం నిర్వహంచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వైవీఎస్ వీజీ పార్థసారధి, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం మహతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ హెల్మెట్ వాడకం, దాని ఉపయోగాలు, ప్రమాదాలు జరకుండా, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎస్ ఎన్‌వీ నాయుడు, సెక్రటరీ గౌస్ మొహిద్దీన్, గాలి నాగరాజు, బ్రహ్మం, సీనియర్ న్యాయవాదులు రామకోటేశ్వరరావు, పీజే లూకా, సైదారావు, హనుమంతరావు, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, సుందర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, అమర్ బాబు, తిరుపతిరావు, ఎం. శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి

నరసరావుపేట రూరల్, జూలై 27: కొంతకాలంగా కురుస్తున్న వర్షా లకు ఇళ్ల మధ్యలో, ఖాళీ ప్రదేశాల్లో వర్షపునీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో దోమలవాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. పట్టణ శివారు ప్రాంతంలోగల చంద్రబాబునాయుడు కాలనీలో పలు ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్‌ను వదిలారు. కార్యక్రమంలో జిల్లా మలేరి యా అధికారి డాక్టర్ కె.రవీంద్ర రత్నాకర్, డాక్టర్ హనుమకుమార్, ఏ ఎంవో సీహెచ్ వెంకటేశ్వర్లు, కొల్లిపర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు

చిలకలూరిపేట, జూలై 27: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకై మున్సిపల్ అధికారులు పలు ప్రాంతాల్లో వరుసగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పారిశుధ్యాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపరిచేందుకై కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు సుగాలీకాలనీ, శాంతినగర్, పురుషోత్తమ పట్నం ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నాదెండ్ల, జూలై 27 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పల్నాడు జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని సాతులూరు గ్రామంలో గల బొమ్మలాట కాలనీలో శనివారం పర్యటించారు.

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ

రొంపిచర్ల, జూలై 27 : మండలంలోని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలిం చారు. వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరగటి చర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగలతులు

వినుకొండ, జూలై 27: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని నిర్మలా పాఠశాలలో 9 రోజులుగా నిర్వహించిన నియోజకవర్గం స్థాయి టీచ్ టూల్ లెర్నింగ్ అబ్జర్వేషన్ శిక్షణా తరగతులు ముగిసినట్లు ఎంఈవో జఫ్రుల్లా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన తరగతుల్లో బోధానా విధానాన్ని పరిశీలించి, అవసరమైన సూచనలు చేయ డం ద్వారా విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీలు ప్రతాప్, రామారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.